క్లుప్తంగా

తాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం తగదు

కొత్తపల్లి: ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. మండలంలోని అమీనాబాదులో శనివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకం ట్యాంకులో నీటిని పూర్తి స్థాయిలో క్లోరినేషన్ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. అమీనాబాదులో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాకినాడ రోడ్డులో వర్షపు నీరు



నీటితో నిండిన కాకినాడ రోడ్డు

సామర్లకోట: కాకినాడ రోడ్డులో వీకే రాయపురం–మాధవపట్నం మధ్య రహదారి వర్షపు నీటితో చెరువుగా మారిపోయింది. శనివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోదావరి కాలువ, వెస్ట్ ఏలేరు డ్రైన్లు నిండిపోవడంతో వాటిలో నీరు రోడ్లపై ప్రవహించింది. దాంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న చిన్న వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

పీఏసీఎస్ ఉద్యోగుల ధర్నా

కొత్తపల్లి: స్థానిక డీసీసీబీ బ్రాంచి వద్ద శనివారం మండలంలోని పీఏసీఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా సొసైటీల (సహకార సంఘాల) ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాదరబోయిన నరపరాజు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచి మేనేజర్ అశ్వినిదేవి, నోడల్ ఆఫీసర్ రమణమూర్తి, గోవింద రాయుడు, గుండ్ర కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పెద్దాపురం: ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో పట్టణ పరిధిలో తాళూరి సూర్యనారాయణ సన్స్ పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, దుకాణంలో నిల్వకు మధ్య వ్యత్యాసాలు రావడంతో షాపు యజమానిపై 6ఏ కేసును నమోదు చేశారు. అలాగే రూ.58,869 విలువైన 9.945 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారి భార్గవ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో సత్యవతి ప్రతిభ




పెద్దాపురం: పీజీ సెట్‌లో పెద్దాపురం మహారాణి కళాశాల విద్యార్థి కాళ్ల సత్య ప్రతిభను కనబరిచింది. 21 సబ్జెక్టుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షలలో సత్య తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది.

ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చేలా చూడాలని వినతి

పిఠాపురం: పదో తరగతిలో 569 మార్కులు వచ్చినా తనకు ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని, తనకు న్యాయం చేయాలని గొల్లప్రోలు గరల్స్ హైస్కూల్ విద్యార్థిని రామిసెట్టి దేవి కోరింది. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. తనకు అర్హత ఉన్నా సీటు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, తన కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి సీటు వచ్చిందని తెలిపింది. దీనిపై అధికారులతో మాట్లాడి తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విద్యాశాఖాధికారులతో మాట్లాడి అవకాశం ఉన్నంతలో సీటు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సురేంద్ర

పెద్దాపురం: వర్షాకాలంలో వచ్చే వ్యాధులలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పబ్లిక్ హెల్త్ సెంటర్ వైద్యులు సాయికిరణ్, మోనంద్‌చంద్ర, శ్రీ జీవన్, హెల్త్ సెక్రటరీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మొగలి విమల
- నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని పిఠాపురం మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ మొగలి విమల అన్నారు. పిఠాపురంలో మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విమల మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతులకు సేవ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు సహకారంతో పిఠాపురం మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లోనూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా తయారైన మార్కెట్ కమిటీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్వ వైభవాన్ని తీసుకువచ్చిందన్నారు. మార్కెట్ కమిటీలను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ పిఠాపురం మార్కెట్ కమిటీకి ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. వరితో పాటు వాణిజ్య పంటలకు పుట్టినిల్లయిన పిఠాపురం నియోజకవర్గంలో మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన నూతన చైర్‌పర్సన్ మొగలి విమల మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ఆమె భర్త మొగలి బాబ్జి గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారని, ఆయన అనుభవంతో ఇద్దరూ కలిసి పని చేసి మార్కెట్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, మొగలి అయ్యారావు, మొగలి జయబాబు, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, పర్ల రాజా, జ్యోతుల భీముడు, మొగలి సాంబశివరావు, మొగలి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల ఆందోళన



గోకివాడలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పిఠాపురం: పంట కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఇనుప చట్రాలు తొలగించడాన్ని నిరసిస్తూ గత ఐదు రోజులుగా పిఠాపురం మండలం గోకివాడ రైతులు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. రైతులు శనివారం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గోకివాడ వద్ద పుట్టకొండయ్య కాలువపై అక్రమంగా ఇనుప చట్రాలు తొలగించారని, వాటిని తిరిగి అమర్చి తమ గ్రామంలో చెరువు నిండిన తరువాత ఇతర గ్రామాలకు నీరు వెళ్లేలా చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని రైతులు వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో జరిగే తీవ్ర పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేడు ఉచిత ఆరోగ్య పరీక్షలు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. ఈ వైద్య పరీక్షల్లో భాగంగా సుగర్, బీపీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98664 11346 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో శాకంబరి అలంకరణ



సామర్లకోటలోని బాలత్రిపురసుందరి సమేత కుమార రామభీమేశ్వరాలయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. ఏటా ఆషాఢ మాసంలో మాస శివరాత్రి రోజున అమ్మవారిని ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు అమ్మవారికి ఆషాఢ సారే సమర్పించనున్నట్టు ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారమే సుమారు 800 కిలోల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారికి అలంకరణ పనులు ప్రారంభించారు.

నిండా ముంచారు

- పూడిక తీయకపోవడంతో పొలాల్లో నిలచిన నీరు
- కూలీలను సమకూర్చుకుంటే పనులు చేపడతామన్న అధికారులు
- వారి నిర్లక్ష్యానికి నాట్లు ఆలస్యం



వీకే రాయపురంలో వర్షపు నీటిలో ఉన్న పంట భూములు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురంలోని తూటేరు డ్రైన్‌లో పూడిక తొలగించకపోవడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గత వారం పొలాలు నీట మునగడంతో 'నిర్లక్ష్యానికి మూల్యం' అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఆ గ్రామ రైతులు సోమవారం కలెక్టరును కలసి పరిస్థితిని వివరించారు. దాంతో కలెక్టర్ పూడిక తొలగింపునకు అంచనాలు వేయాలని ఎంపీడీఓ శ్రీలలితను ఆదేశించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు రూ.1.95 లక్షలతో అంచనాలు వేశారు. ఈ మొత్తం విడుదలైనా పనులు మొదలు పెట్టకపోగా రైతు సంఘం నుంచి నలుగురు కూలీలను ఏర్పాటు చేసుకుంటే సోమవారం నుంచి పూడిక తీత ప్రారంభిస్తామని ఎంపీడీఓ మెలిక పెట్టారు. కాగా ముంపు సమస్య పరిష్కారం అయిన తరువాత మాత్రమే వరి నాట్లు వేయాలని రైతులు నిర్ణయించారు.



మత్స్యకారుల వలలకు చిక్కిన కవళ్లు, కోనెం చేపలు

అచ్చారే... మత్స్యారే..



కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు శనివారం భారీగా మత్స్యసంపద చిక్కింది. చేపల విక్రయాలతో అమీనాబాద్ తీరప్రాంతం కిటకిటలాడింది. మత్స్యకారుల వలలకు ఎక్కువగా రొయ్యలు, కవళ్లు, కోనాలు తదితర చేపలు చిక్కాయి. అమీనాబాద్ తీరంలో సుమారు రూ.30 లక్షల వరకూ చేపల వ్యాపారం జరిగింది. కొనుగోలు చేసిన మత్స్య సంపదను వ్యాపారులు తమిళనాడు, కేరళ, హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలించారు.

పనుల్లో ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక చల్లా వారి గరువులో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు తాటికొండ వెంకటలక్ష్మి, పెద్దకాపు, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, బొడ్డు ప్రకాష్, తదితరులు ఉన్నారు.

వలంటీర్లకు వందనం

దళారులు లేకుండా సేవలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళారులు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో అర్హతలు ఉన్నా పథకాల కోసం దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పది సార్లు తిరిగి వారికి ఎంతో కొంత ముట్టజెప్పితేనే పథకాలు అందేవి. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థతో ఆ కష్టాలు తొలగిపోయాయి. మా వలంటీర్ ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తాడు. ప్రతి నెలా ఇంటి వద్దకే రేషన్ వస్తోంది. ఇలాంటి సేవలు గతంలో లేవు. వలంటీర్ వ్యవస్థ ద్వారా మాకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

– ఆలపు రాణి, లబ్ధిదారు, వాకతిప్ప

అప్రమత్తం చేసిన వలంటీర్లు



అస్సాం నుంచి వచ్చిన చంటిబాబుతో మాట్లాడుతున్న వలంటీరు మల్లిక, హెల్త్ సిబ్బంది

కోరోనా సమయంలో ఎవరికి వారే అన్న సమయంలో అస్సాం నుంచి వచ్చిన ఓదూరి చంటిబాబు అనే వ్యక్తిని వలంటీరు దువ్వా మల్లిక అప్రమత్తం చేసి కోరోనా పరీక్షలు చేయించింది. కరోనాలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ధైర్యం చెప్పడంతో కరోనాను అతడు జయించాడు. దాంతో కరోనా నుంచి బయట పడి ప్రస్తుతం ఆరోగ్యంగా జీవిస్తున్నాడు.

ధైర్యం చెప్పి ప్రాణం నిలిపింది



జ్వరం వచ్చిన వెంటనే కరోనా వచ్చింది అనేక మంది బయపడ్డారు. ఈ భయంతో అనేక మంది చనిపోయారు. అయితే కరోనా రోజుల్లో ప్రతీ రోజు వలంటీర్ ఇంటికి వచ్చి ధైర్యం చెప్పడంతో కరోనాను జయించాను.

– ఓదూరి చంటిబాబు, సామర్లకోట

ఇంటికే సంక్షేమ పథకాలు



పిఠాపురం ఇందిరా నగర్‌లో లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం ఇందిరా నగర్‌లో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వార్డులో పర్యటించిన ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ప్రజలను ఆరా తీశారు. సాధారణంగా నాయకులు ఎన్నికల్లో వస్తారు.. మళ్లీ కనిపించరు.. ఏదైనా పని కావాలంటే మేము వెళ్లినా పట్టించుకోరు.. కాని ఇప్పుడు మీరు మేము పిలవకపోయినా మా ఇంటికి వచ్చి మా సమస్యలు తెలుసుకుంటున్నారు అంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందేలా చేశారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోను దేవ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చిన్నారికి షేక్‌హ్యాండ్ ఇస్తున్న దవులూరి దొరబాబు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- పెద్దాపురంలో గడప గడపకూ...

పెద్దాపురం : పార్టీ రహితంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడపగడపకూ ప్రభుత్వంలో భాగంగా శనివారం రెండో సచివాలయం పరిధిలోని 3, 28, 29 వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ వెళ్లి నాలుగేళ్ల కాలంలో అందుకున్న పథకాలను వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, నాగబోయిన రాజుబాబు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, నల్లల గోవిందు, చింతా శ్రీ,నివాసరావు, ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, సిమ్మ గోవిందు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా సురక్ష శిబిరాలు



ఏకే మల్లవరంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



వేట్లపాలెంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న దొరబాబు



పాత ఇసుకపల్లిలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షణ కవచంగా మారిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. గ్రామాల్లో వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు అవసరమైన జనన, మరణ, నివాస, భూమి హక్కు పత్రాలను అధికారులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల రామయ్యమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, వైఎస్సార్ సీపీ నేత కడింశెట్టి భాస్కరరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే...

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేక మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం వలన రుణాలు పొందలేని పరిస్థితిలో ఉన్నారని వారి సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ప్రజల కోసం పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉంచుకునేలా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. కార్యక్రమలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ ఎస్ఎల్‌పీ కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలచర్ల సాయిబాబు పాల్గొన్నారు.

సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో..

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

దివిలిలో ధ్రువపత్రాల అందజేత

పెద్దాపురం: మండలంలోని దివిలి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్ అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలను అంజదేశారు. జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సానబోయిన రాజుబాబు, డిప్యూటీ తహసీల్దార్ కాంతారావు, సర్పంచ్ పెంకే శ్రీను, ఉప సర్పంచ్ విజ్జపురెడ్డి రమేష్, నరాలశెట్టి త్రినాథ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వరం

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామాల్లోని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఓ వరమని పాత ఇసుకపల్లి సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం జనగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్పంచ్, అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్త ఇసుకపల్లి సర్పంచ్ తమిలిశెట్టి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, డీటీ శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ ఎరకం దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.